ముంపు తెచ్చిన తంటా


అవిశాల డ్రెయిన్‌లో పూడికలు తొలగిస్తున్న దృశ్యం


ముంపు నీరు తొలగడంతో గడ్డిజాతి మొక్కల్ని తొలగిస్తున్న రైతులు

- సాగుకు ఇబ్బందిపడుతున్న రైతులు
- గడ్డిమొక్కలతో అవస్థలుపడుతున్న వైనం

ఆకివీడు: మండలంలోని మురుగు కాలువలు అధ్వానంగా ఉండటంతో ఇటీవల వచ్చిన వరదల ముంపు నీరు నేటికీ బయటకు చొచ్చుకువెళ్లకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని కొల్లేరు తీరగ్రామాల్లోని పలు చోట్ల ముంపు నీరు నేటికీ తిష్టవేసి ఉంది. గత వారం రోజులుగా స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని అవిశాల మురుగు కాలువలో చెత్త తొలగించడంతో ముంపు నీరు మెల్లమెల్లగా బయటకు చొచ్చుకుపోతుంది. చేలల్లో అడుగున్నర పైగా ముంపునీరు తిష్టవేసి ఉంది. దీని వల్ల దమ్ము పనులు కూడా జరగకుండా రైతులు రబీ పనుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఎకరానికి రూ.1500

అవిశాల కాలువ పరిధిలోని సుమారు 600 ఎకరాల ఆయుకట్టు రైతులు ఎకరానికి రూ. 1500 నగదు చెల్లించి కాలువలో చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. పంటిపై నుంచి ప్రొక్లయినర్ ద్వారా చెత్తను తొలగిస్తున్నారు. పలు చోట్ల అవిశాల డ్రెయిన్ ఆక్రమణలకు గురైందని రైతులు వాపోతున్నారు. ఆక్రమణలు తొలగించి, వేసవిలో డ్రెయిన్ పూడిక పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. డ్రెయిన్ పూడికలు తీయకపోతే ప్రతిఏటా ముంపు బెడద తప్పదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం డ్రెయిన్ తవ్వకం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నాలుగేళ్ల క్రితం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో అవిశాల డ్రెయిన్‌లో తూడు, చెత్త తొలగింపు పనులు చేపట్టారు. అప్పటి నుంచి ఈ డ్రెయిన్‌ను పట్టించుకోకపోవడంతో కిక్కిస దట్టంగా పేరుకుపోయి నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది.

విపరీతంగా పెరిగిన నాచు మొక్కలు

ముంపు గ్రామాల్లోని వరి చేలల్లో నాచు జాతి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయింది. తామర మొక్కలు అల్లుకుపోయాయి. ఈ పరిస్థితుల్లో చేలల్లో దమ్ము పనులు చేపట్టే అవకాశం లేకపోవడంతో రబీ నాట్లు నేటికీ వేయలేదు. చేలల్లో విపరీతంగాపెరిగిపోయిన నాచు మొక్కలు, గడ్డిజాతి మొక్కలు రైతులకు కత్తిమీద సాములా పరిణమించాయి. చేలల్లోకి దిగే అవకాశమే లేకుండా పోయింది. అడుగులోతులో పేరుకుపోయి. వాటిని తొలగించుకునేందుకు ఎకరాకూ రూ 15 వేల నుండి రూ. 20 వేల వరకూ వ్యయమవుతుందని రైతులు వాపోతున్నారు. ముంపు ప్రాంతాల్లో రైతులకు ప్రభుత్వం రూ. 10 వేలు నష్టపరిహారం ఇచ్చినప్పటికీ ఆ సొమ్ము చేలల్లో చెత్త తొలగించడానికి కూడా సరిపోలేదని వాపోతున్నారు. జనవరి నెలాఖరు వచ్చినప్పటికీ రబీ నాట్లు మండలంలోని పలు చోట్ల మెల్లమెల్లగా కొనసాగుతూనే ఉన్నాయి. ముంపు వీడని ప్రాంతాల్లోనే నాట్లు పడాల్సి ఉంది.

ఆదిపరాశక్తి పీఠానికి తరలిన భక్తులు


ఆకివీడు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఆదిపరాశక్తి అమ్మవారి భక్తులు

ఆకివీడు: తమిళనాడులోని మేల్ మెరువత్తూర్‌లోని ఆది పరాశక్తి అమ్మను దర్శించుకుని, ముడుపులు చెల్లించేందుకు మాలాధారణతో శనివారం భక్తులు ఊరేగింపుగా తరలివెళ్లారు. ముందుగా స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు వచ్చి, అక్కడ నుంచి రైలులో బయలుదేరి వెళ్లారు. స్థానికంగా అమ్మవారి ముడుపుల్ని కట్టుకుని, ఎర్రని దుస్తులు ధరించి, సుమారు 1200 మంది భక్తులు పీఠానికి బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్థానిక పీఠం గురుస్వామి జగన్ ఉషా దంపతులను భక్తులు సత్కరించారు.

గణతంత్ర వేడుకలకు డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్లు


గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికైన డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్లు

భీమవరం: విజయవాడలో ఆదివారం నిర్వహించే రాష్ట్ర గణతంత్ర దినోత్సవ వేడుకలకు భీమవరం డీఎన్నార్ కళాశాల సీనియర్ డివిజన్ తృతీయ సంవత్సరపు ఎన్‌సీసీ క్యాడెట్లు ముగ్గురు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ జి మోజెస్ శనివారం విలేకర్లకు చెప్పారు. గణతంత్ర వేడుకలకు బి లీలా శంకర్, పి రాంబాబు, సీహెచ్ వంశీ ఎంపికై కళాశాలకు ప్రతిష్ట తీసుకువచ్చారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకటనర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు), ప్రిన్సిపల్ మోజెస్ తదితరులు అభినందించారు.

ఆకట్టుకున్న త్రివర్ణ వేడుక


త్రివర్ణకళను తిలకిస్తున్న విద్యార్థులు

భీమవరం: గణతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం భీమవరం శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా త్రివర్ణ కళ, చేతిపనుల ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవం ద్వారా విద్యార్థులకు దేశభక్తి స్ఫూర్తి, భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్ అన్నారు.

పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శిరీష

కాళ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. వ్యవసాయ శాఖ ఏఈ వాసుకి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వమే జమ చేసేదని తెలిపారు .అయితే ఈ ఏడాది నుంచి రైతులే చెల్లించాలనే విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులను కోరారు. విద్యుత్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ ఇళ్లకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, దీన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సరాబు పద్మారాణి, మన్నే నాగలక్ష్మి, సర్పంచ్‌ల ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఎంపీడీఓ జి.స్వాతి, ఎంఈఓ రవీంద్ర, డాక్టర్లు ఎస్. సునీల్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన


హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆకివీడు: హెల్మెట్ ధరించడం ద్వారా మీ ప్రాణాల్ని మీరే కాపాడుకున్నట్లు అవుతుందని ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, ఎస్సై హనుమంతు నాగరాజు సూచించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో శనివారం హెల్మెట్ ధారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు జరినప్పుడు మిమ్మల్ని హెల్మెట్ రక్షిస్తుందన్నారు. ప్రమాదం జరిగినప్పుడు తలకు గాయం కాకపోతే 70 శాతం ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాల్ని నడపాలని సూచించారు. హెల్మెట్ లేకపోతే అపరాధ రుసుము కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

వీరవాసరం హైస్కూల్లో తనిఖీలు


వీరవాసరం హైస్కూల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరుగుతుందని సోషల్ ఆడిట్ డీఆర్పీ యోగానంద తెలిపారు. వీరవాసం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా చక్కటి విద్యాభ్యాసంతో పురోభివృద్ధి సాధించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం సైన్సు ల్యాబ్ టి.ఎల్.ఎమ్ క్రీడలు తరగతి గదిలో నిర్వహణ తదితర అంశాలపై పాఠశాలలో వివరాలు సేకరించారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, పంపన సాయిబాబా ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యుత్ మీటర్ రీడర్సుకు ప్రతి నెల వేతనాలు ఎస్కో అకౌంట్స్‌ను ప్రారంభించాలని విద్యుత్ శాఖ ఎస్.ఇ ఆలపాటి రఘునాథ్‌బాబును విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. ఏఐటీయుసి అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ 2025 క్యాలెండర్‌ను శనివారం విద్యుత్‌శాఖ ఎస్ఇ ఆలపాటి రఘునాథ్‌బాబు, కోనాల భీమారావు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. జాకబ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేతివృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ ఎం.సీతారాంప్రసాద్, విద్యుత్ మీటర్ రీడర్సుకు జిల్లా ఉపాధ్యక్షులుపి.జాకబ్, శ్రీనివాసరావు, రఘునాథరావు, నర్సింగం, శ్రీనివాసరావు, చింతయ్య, ఆదారి నర్సింహమూర్తి, కె.బాలాజీ, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో డెవ్ ఛాలెంజ్ పేరుతో హ్యాకథాన్


ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గూగుల్ డెవలపర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఈనెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో డెవ్ ఛాలెంజ్ పేరుతో హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. శనివారం హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వివరాలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక దృక్పథాన్ని, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందిస్తాయన్నారు. హ్యాకథాలో విద్యార్థులు ఏఐతో పాటు ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారాలు రూపకల్పన చేస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో గూగుల్ నిర్వహిస్తున్న సొల్యూషన్ ఛాలెంజ్ కోసం విద్యార్థులు ప్రాజెక్టులు సమర్పించి తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. గూగుల్ డెవలపర్ గ్రూప్స్ లీడ్ గూడపాటి యక్షిణి అనన్య మాట్లాడుతూ ఈ హ్యాకథాన్ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఒక చక్కటి వేదికన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎన్‌గోపాలకృష్ణమూర్తి, ఏఐసిటిఈ ఐడియా ల్యాబ్ కోఆర్డినేటర్ ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యారీబ్యాగ్‌లు కనిపిస్తే జరిమానాలు తప్పవు


భీమవరంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

భీమవరం: పట్టణంలో క్యారీబ్యాగ్‌లు కనిపిస్తే జరిమానాలు తప్పవని జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం త్యాగరాజ భవనంలో పురపాలక సంఘం, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాపారులు, ప్రజలు చిత్తశుద్ధితో ఆచరిస్తేనే ప్లాస్టిక్ నిషేధించడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేదం అమలుచేద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


యండగండి ఉచిత పశువైద్య శిబిరంలో పశువులను పరిశీలిస్తున్న ఏడీ శ్రీదేవి

ఉండి: మండలంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులంతా వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉండి సహాయ సంచాలకురాలు పి.శ్రీదేవి అన్నారు. శనివారం ఉండి మండలం యండగండిలో నిర్వహించి ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాల ద్వారా 300 పశువులు, 200 కోళ్లకు వాక్సిన్ ఇచ్చామని తెలిపారు. అలాగే 86 పశువులకు చికిత్స అందించామని వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి టి.హేమ పాల్గొన్నారు.

గాదిరాజు బాబుకు పలువురి పరామర్శ


భీమవరంలో గాదిరాజుబాబును పరామర్శిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు, గోపీమూర్తి

భీమవరం: పితృవియోగంతో బాధపడుతున్న భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు)ను శనివారం పలువురు నాయకలు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, ఎమ్మెల్సీ బి గోపీమూర్తి, యిర్రింకి సూర్యారావు, డాక్టర్ చీడే సత్యనారాయణ తదితరులు పరామర్శించారు.

ప్లాస్టిక్ నిరోధానికి సహకరించాలి


షాపుల్లో తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: ప్లాస్టిక్‌ను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమేశ్వర ఆలయం చుట్టుపక్కల ఉన్న డిస్పోజబుల్ హోల్‌సేల్ షాపులను, టిఫిన్ సెంటర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా మున్సిపల్ అధికారులతో కలిపి తనిఖీ చేశారు. నిబంధనలను అతిక్రమించి అమ్మకాలు జరిపితే అపరాధ రుసుముతో పాటు, చట్టబద్ధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, శానిటరీ వార్డ్ సెక్రటరీస్, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విజేతలకు బహుమతులు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

నరసాపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. నరసాపురం మండల న్యాయసేవాధికార సంస్థ డిసెంబర్ నెలలో పట్టణంలోని వైఎన్ కళాశాల. సూర్యా కళాశాల, గౌతమి కళాశాలల్లో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వివిధ చట్టాలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జడ్జి గంగరాజు అందుబాటులో ఉన్న చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, సూర్యా కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముసలమ్మ జాతర ఉత్సవాలు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం పంచాయతీ పల్లపు వీధిలో ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ వారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి వార్షికోత్సవం సందర్భంగా పాలకొల్లు వీరన్నబాబు గద్దె నిర్వాహకులు పశ్యావుల అనంత ప్రసాద్, పోలిశెట్టి సాయి ప్రసాద్ బ్రహ్మత్వంలో శనివారం అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


ఉండి: ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న డీపీఓ అరుణ


ఆకివీడు: ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉండి: మన ఓటు హక్కే మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని జిల్లా పంచాయితీ అధికారి బి అరుణశ్రీ అన్నారు. శనివారం ఉండిలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్ రత్నకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులతో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఉండి సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం ర్యాలీగా ఉండి హైస్కూల్‌కు చేరుకుని అక్కడ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, ఆర్ఐ కార్తీక్, హెచ్ఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమైనదని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ స్కూల్ నుంచి విద్యార్థులు, మండల అధికారులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో రీడర్స్‌పోరం అధ్యక్షుడు దాసరి వెంకట సత్యనారాయణ, ఎస్సై హనుమంతు నాగరాజు, ఎంఈఓ ఎ.రవీంద్ర, డీటీ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చెరుకుమిల్లిలో సర్పంచ్ నందమూరి ప్రకాశం ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్ దాట్ల కృష్ణమూర్తి రాజు సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ చైర్మన్ సైదాల సూర్యనారాయణ, సీనియర్ సిటిజన్లు ఎరిచర్ల సంసోన్, దాట్ల వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాళ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.సుందర్ సింగ్ మాట్లాడుతూ ఓటరు నమోదు ఆవశ్యకతను, ఓటు హక్కు విలువలను వివరించారు. అనంతరం సీనియర్ ఓటర్లయిన వయోవృద్ధులను సత్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఓటు ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు శివనాగరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారం

భీమవరం: దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ఓటును స్వచ్ఛందంగా నిర్భయంగా వేయాలని భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు అన్నారు. భీమవరంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం ర్యాలీ, మానవహారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగం ఓటు నమోదు ఓటు పవిత్రతలపై అవగాహన కల్పిస్తూ దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారని అన్నారు. వన్ టౌన్ సీఐ ఎం నాగరాజు మాట్లాడుతూ విద్యావంతులు నిరక్షరాస్యులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలని, 18 ఏళ్ల నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ మీదుగా చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లు కనుమూరి సత్యనారాయణ రాజు, చెరుకువాడ రంగసాయి, గ్రంధి శ్రీరామ మూర్తి, తుమ్మలపల్లి శివలను సత్కరించారు.ఈ కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, డీలర్స్ అసోసియేషన్ సభ్యులు, కెజిఆర్ ఎల్ బి ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. కొత్తగా ఓట్లు వచ్చిన ఓటర్లను ఓటు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఓటు నమోదు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, గెద్దం భారతి, అడ్డాల శ్రీరామచంద్ర మూర్తి, సైదు శ్రీనివాసరావు, దాసరి మహాలక్ష్మి, చికెలే మంగతాయారు, మేకల వెంకట చలపతి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం

భీమవరం: భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ కె గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


కాళ్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్


భీమవరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


వీరవాసరం: సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు


భీమవరం: విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం